కూటమి దెబ్బకు ఆటో కుదేలు

గతంలో ఆటో కార్మికులకు ఉద్యోగం లేకపోయినా ఆటో వేసుకుని అయినా కుటుంబాన్ని పోషించుకోగలమనే ధైర్యం ఉండేది. రోజుకు సుమారు రూ.1500 వరకు సంపాదించేవారు. అద్దె, పెట్రోల్ తదితర ఖర్చులు పోను రూ.500 నుంచి రూ.800 వరకు మిగిలేది. కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వారి పరిస్థితి దారుణంగా ఉంది. ఒకవైపు ఆయిల్ ధరలు పెరిగిపోవడం.. మరోవైపు పెనాల్టీల మోత .. ఇంకోవైపు ఆటో కార్మికులకు ప్రభుత్వ సాయం అందకపోవడం.. ఇలా ముప్పేటదాడితో సతమతమవుతున్న వారికి శుక్రవారం నుంచి అమలు కానున్న మహిళలకు ఉచిత బస్సు పథకం మూలిగే నక్కపై తాటిపండు చందంగా మారింది.



తగరపువలస ఆటోస్టాండ్‌లో నిలిపి ఉంచిన ఆటోలు



తమ డిమాండ్లు నెరవేర్చాలని నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు

తగరపువలస: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆటో కార్మికుల పరిస్థితి దయనీయంగా మారిపోయింది. ఎప్పటికప్పుడు ఇంధన ధరలు మండిపోవడంతో పాటు రాంగ్ పార్కింగ్, పొల్యూషన్, ఇన్సూరెన్స్, ఓవర్‌లోడ్, లైసెన్స్, పర్మిట్ల పేరుతో రూ.10వేల వరకు వసూలు చేస్తుండటంతో వీటిని భరించలేక ఆటో అద్దెకు తీసుకుని నడుపుతున్న కార్మికులు మరో ఉపాధి వైపు వెళ్లిపోయారు. భీమిలి నియోజకవర్గంలో 8 వేల మందికి వరకు ఆటో కార్మికులు ఉన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మారిన తరువాత వీరిలో సగానికి పైగా కార్మికులు కూటమి ప్రభుత్వ వేధింపుల బారిన పడ్డవారే.

జగనన్న వాహనమిత్రతో ఊరట

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలం ఆటో కార్మికులకు స్వర్ణయుగం. వాహనమిత్ర పేరుతో ఏటా రూ.10వేల వంతున కార్మికుల ఖాతాల్లో జమ చేసేవారు. దీనిని ఆటోల ఫిట్‌నెస్, బీమా తదితర అవసరాలకు వినియోగించుకునేవారు. ఆ ఐదేళ్ల కాలంలో వాహనమిత్ర ద్వారా 5404 మంది ఆటో కార్మికులకు రూ.21.61 కోట్లు చెల్లించిన ఘనత వైఎస్సార్‌సీపీది. కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రచారానికి వచ్చిన నాయకులు ఆటో కార్మికులను మభ్యపెట్టి చంద్రబాబు సీఎం అయితే ఏటా రూ.15వేలు ఇస్తారని చెప్పారు. 14 నెలలుగా ఎదురు చూస్తున్న కార్మికులకు ప్రభుత్వ సాయం అందనే లేదు.

పులిమీద పుట్రలా స్త్రీ శక్తి పథకం

అసలే ప్రభుత్వ సాయం అందక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఆటో కార్మికులపై కూటమి ప్రభుత్వం ఆగస్టు 15నుంచి ప్రవేశపెడుతున్న స్త్రీ శక్తి పథకం పులిమీద పుట్రలా వచ్చి పడినట్లయింది. మహిళలకు ఉచిత బస్సు పథకంతో ఆటో కార్మికులు భవిష్యత్తుపై బెంగ పెట్టుకున్నారు. తమ ఆటోలలో 60 శాతం మంది మహిళలే ప్రయాణించేవారని ఇప్పుడు ఉచిత బస్సు పథకంతో తమ బతుకు బండి నడిచేదెలా అని వాపోతున్నారు. ఆటో కార్మికుల సంక్షేమాన్ని గాలికి వదిలేయడంతో ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఆటో కార్మికులు తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



ఆటో కార్మికులలో ఎక్కువ మంది తక్కువ చదువుకున్నవారు, నిరక్షరాస్యులే ఉన్నారు. వీరికి ఆటో రైడ్ తప్ప మరో పని చేతకాదు. ప్రభుత్వం సాయం చేయకపోగా మహిళలకు ఉచిత బస్సులు పెడితే వచ్చే నెల నుంచి వాయిదాలు చెల్లించకపోతే ఫైనాన్షియర్లు ఆటోలు పట్టుకుపోతారు. అందుకోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి.

– నీలాపు రామిరెడ్డి, తగరపువలస

ప్రభుత్వం పునరాలోచించాలి



మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఆటోరంగంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఒక్క ఆటో కార్మికులకే కాకుండా ఆటో తయారీ, ఇంధనం, విడి పనిముట్లు, మెకానిక్‌లకు ఉపాధి తగ్గిపోతుంది. అత్యవసర సమయంలో ఆటో వచ్చినట్టు బస్సు రాదుకదా. ప్రభుత్వం పునరాలోచిస్తే బాగుండేది.

– ఎర్ర అప్పలనాయుడు, ఆనందపురం

ఉచితం కాకుండా టికెట్ల ధర తగ్గించాల్సింది



మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కంటే టికెట్ల ధరలు తగ్గిస్తే బాగుండేది. గత ప్రభుత్వం ఏటా కార్మికులకు రూ.10వేలు ఇచ్చినట్టే ఈ ప్రభుత్వం కూడా సాయం చేయాలి. సాయం అందక, మహిళా ప్రయాణికులు తగ్గితే ఆటో కార్మికుల భవిష్యత్తు తలచుకుంటేనే ఆందోళనగా ఉంది.

– చిల్ల రాజశేఖరరెడ్డి, చిట్టివలస

ఇంధనంపై రాయితీలు ఇవ్వాలి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు ఫైన్‌లు ఏవీ రూ.150 నుంచి రూ.700 మించేవి కావు. ప్రస్తుతం ఆటో కార్మికులకు ఎలాంటి సాయం అందకపోగా ఫైన్లు రూ.10వేల వరకు విధిస్తున్నారు.గత ప్రభుత్వంలో పర్మిట్‌కు రూ.700 అయితే ఇప్పుడు రూ.1500 వసూలు చేస్తున్నారు. ఇంధన రాయితీలు ఇచ్చినా కొంత మేలు జరుగుతుంది. – ఒమ్మి రాజు, అన్నవరం

క్లుప్తంగా

మేరా భారత్ మహాన్..



బీచ్ వద్ద జెండా ప్రదర్శిస్తున్న విద్యార్థులు

భీమునిపట్నం: మేరా భారత్ మహాన్ అంటూ విద్యార్థులు నినదించారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు బీచ్ వద్ద జాతీయ జెండాలతో గురువారం నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమానికి హాజరైన జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో దేశభక్తి భావం పెరుగుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనంతుని ఆలయానికి ఇన్వెర్టర్ బహూకరణ



ఇన్వెర్టర్ అందిస్తున్న దాతలు

పద్మనాభం: పద్మనాభంలో గిరిపై వెలసిన అనంత పద్మనాభ స్వామికి హైదరాబాద్‌కు చెందిన ఎమరాన్ బ్యాటరీ డిస్ట్రిబ్యూటర్ శ్రీ సిరి చందన ఎంటర్ ప్రైజెస్ అధినేత కుమార్ ఇన్వెర్టర్ బహూకరించారు. ఈ ఇన్వెర్టర్‌ను ఎంపీపీ కంటుబోతు రాంబాబు గురువారం ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు తాలాడ పద్మనాభం, అర్చకుడు పవన్ పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూల్‌కు కుర్చీల వితరణ



స్కూల్‌కు కుర్చీలు అందిస్తున్న జాంబిరెడ్డి

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు జెడ్పీ హైస్కూల్‌కు వైఎస్సార్‌సీపీ నాయకుడు సాడి జాంబిరెడ్డి తన తల్లి పార్వతమ్మ జ్ఞాపకార్థం రూ.5 వేల విలువైన 10 కుర్చీలను గురువారం అందించారు. హెచ్ఎం కె.వెంకటేశ్వరరావు, స్కూల్ కమిటీ చైర్మన్ బుడుమూరి సోమేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో శివుని విగ్రహం ఆవిష్కరణ



కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక పెద్దలు

తగరపువలస: చిట్టివలస శ్మశానవాటికలో రూ.1.80 లక్షలతో నిర్మించిన శివుని విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. శ్వేత రెడీమేడ్స్ యజమాని కొండపు శ్రీనివాసరెడ్డి తన తల్లిదండ్రులు తోగాలమ్మ, రామిరెడ్డి జ్ఞాపకార్థం ఈ విగ్రహాన్ని నిర్మించారు. విగ్రహ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, తెలగా సంక్షేమ సంఘం అధ్యక్షుడు రంగూరి సీతారామదొర, ఒబ్బిలిరెడ్డి ప్రసాద్, ముని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కో–ఆపరేటివ్ బ్యాంక్ వార్షికోత్సవం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మధురవాడ: విశాఖపట్నం కో–ఆపరేటివ్ బ్యాంక్ మధురవాడ శాఖ 15వ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా బ్యాంక్ ఆవరణలో పినాకిల్, మ్యాక్సీ విజన్ కంటి ఆస్పత్రి, క్లోవ్ దంత వైద్యశాల ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. బ్యాంక్ అధ్యక్షుడు జె.వి.సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ 15 సంవత్సరాలుగా రూ. 200 కోట్ల లావాదేవీలు జరిగాయని తెలిపారు. బ్యాంక్ జోనల్ మేనేజర్ ఎం.సత్యనారాయణ, మేనేజర్ ఎం.అప్పారావు పాల్గొన్నారు.

గణపతి ఉత్సవాలకు రాట

తగరపువలస: జీవీఎంసీ రెండోవార్డు ఉళ్లపేటలో గణపతి ఉత్సవాలకు స్థానికులు గురువారం పందిరి రాట వేశారు. ఈ నెల 27 నుంచి ఇక్కడ ఉత్సవాలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు అక్కరమాని మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి..



మజ్జి శ్రీనివాసరావు, గండ్రెడ్డి శ్రీనివాసరావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న టీడీపీ నాయకులు

100 కుటుంబాల చేరిక

తగరపువలస: ఆనందపురం మండలం గండిగుండం, కోలవానిపాలెం పంచాయతీలకు చెందిన 100 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గండ్రెడ్డి శ్రీనివాస్, జిన్నాల వెంకటరమణ ఆధ్వర్యంలో వీరికి పార్టీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చిన్న శ్రీను మాట్లాడుతూ అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం పాలన నచ్చకే ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీలో చేరారన్నారు. పార్టీలో చేరిన ముఖ్య నాయకులలో అడ్డూరి అగ్గిరాముడు, ఈరోతు గౌరీష్, జిన్నాల సూర్యప్రకాష్, సియ్యాద్రి రమేష్, ముమ్మన కనవరాజు, తిరువీధుల అశ్వరాజు, కోన సోంబాబు, ముమ్మన మారేష్, గోకాడ దేవుళ్లు తదితరులు ఉన్నారు.

వెల్డింగ్ షాపులు, రెస్టారెంట్ల తనిఖీ



వెల్లంకిలో కంటైనర్ల తయారీ పరిశ్రమలో వివరాలు సేకరిస్తున్న ఆర్డీవో సంగీత్ మాథూర్

తగరపువలస: ఆనందపురం, భీమిలి మండలాలలోని పలు వెల్డింగ్ షాపులు, రెస్టారెంట్లను భీమిలి ఆర్డీవో సంగీత్ మాథూర్ గురువారం తనిఖీ చేశారు. ఇటీవల ఫిషింగ్ హార్బర్ వద్ద వెల్డింగ్ షాపులో జరిగిన పేలుళ్ల దృష్ట్యా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టారు. రెస్టారెంట్లు, వెల్డింగ్ షాపులలో కమర్షియల్ సిలిండర్లు కాకుండా వంటగ్యాస్ సిలిండర్లు వినియోగిస్తున్నట్లు గుర్తించి వాటిని సీజ్ చేసి యజమానులపై 6ఏ కేసులు నమోదు చేశారు. వ్యాపార అవసరాలకు డొమెస్టిక్ సిలిండర్లు వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట సీఎస్‌డీటీ శ్రీనివాసరావు, తాళ్లవలస అగ్నిమాపకశాఖాధికారిశ్రీనివాసరాజు,రెవెన్యూ,జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతి లేకుండా మా భూములను తీసుకుంటున్నారు

కలెక్టర్‌కు కృష్ణాపురం రైతుల ఫిర్యాదు



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కృష్ణాపురం రైతులు

బీచ్‌రోడ్డు: పూర్వం నుంచి సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తమ భూములను, తమ అనుమతి లేకుండా ఎంఎస్ఎంఈ కోసం చట్టవిరుద్ధంగా తీసుకుంటున్నారని పద్మనాభం మండలం, కృష్ణాపురం రైతులు గురువారం కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయనను కలిసి తమకు న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కృష్ణాపురంలో సర్వే నెంబర్లు 88,93లోని 60 ఎకరాల భూమిని 50 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నామన్నారు. ఆ భూమిలో టేకు, నీలగిరి, జీడి మామిడి పెంచుకుంటూ జీవనోపాధి పొందుతున్నామన్నారు. ఈ భూముల్లో 11 మందికి 11 ఎకరాలు డీ పట్టాలు ఇచ్చారని పేర్కొన్నారు. తమకు తెలియకుండా టేకు, నీలగిరి, జీడి మామిడి చెట్లను పొక్లెయిన్లు, జేసీబీలు తీసుకువచ్చి తొలగించడంతో తాము అడ్డుకున్నామని తెలిపారు. దళిత, బలహీన వర్గాలకు చెందిన పేద రైతులమైన తాము తాతలు, తండ్రుల నుంచి ఈ భూముల మీదే ఆధారపడి జీవనం సాగిస్తున్నామన్నారు. ఎంఎస్ఎంఈకి అవసరమైన భూసేకరణకు గ్రామ తీర్మానం చేయలేదని, ప్రజాభిప్రాయ సేకరణ జరపలేదని వివరించారు. ఎంఎస్ఎంఈ పార్కు నిర్మాణానికి భూములు అవసరమైతే గ్రామ సభ ఏర్పాటు చేసి ప్రజాభిప్రాయ సేకరణ చేయాలని రైతులు కోరారు. కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చిన వారిలో గాదు అప్పలరాజు, నల్లి రాంబాబు, పలువురు రైతులు ఉన్నారు.

శాంతినగర్‌లో అగ్నిప్రమాదం



బాధితులను పరామర్శిస్తున్న గుడ్ల పోలిరెడ్డి

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు శాంతినగర్‌లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. వివరాలివి.. ఈ ప్రాంతానికి చెందిన పుడి అప్పయమ్మ కొద్ది సంవత్సరాలుగా ఇక్కడ పాన్‌షాప్ నిర్వహిస్తోంది. గురువారం వేకువజామున ఒక్కసారిగా ఈ పాన్‌షాప్ నుంచి పొగలు వ్యాపించి, అతి తక్కువ సమయంలో పాన్‌షాప్ కాలి బూడిదైపోయింది. మంటలను స్థానికులు అదుపు చేసేలోపే పూర్తిస్థాయిలో దగ్ధమైపోయింది. దీనికి సమీపంలో ఉన్న ఓ ఆటో కూడా పాక్షికంగా దెబ్బతింది. ఈ అగ్ని ప్రమాదం ఎలా సంభవించిందనే దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇది షార్ట్ సర్క్యూట్ వలన సంభవించిన ప్రమాదం కాదని, ఎవరో పెట్రోల్ పోసి నిప్పు అంటించారని బాధితురాలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ అగ్ని ప్రమాదంలో సుమారు రూ. 3లక్షలు ఆస్తి నష్టం వాటిల్లింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరామర్శ

వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వార్డులో దౌర్జన్యాలు, దోపిడీలు జరుగుతున్నందున పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని కోరారు. తమ పార్టీ నుంచి బాధితులకు సాయమందిస్తామన్నారు.

మాట మార్చడం చంద్రబాబుకు అలవాటే..

- ఎన్నికల ముందు ఒకటి.. తర్వాత మరొకటి
- పథకాలు అందక కార్యాలయాల చుట్టూ లబ్ధిదారుల ప్రదక్షిణలు
- హామీలు నెరవేర్చే వరకు ప్రజల తరఫున పోరాడుతాం
- వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు



హాజరైన గండిగుండం పంచాయతీ ప్రజలు



గండిగుండం సభలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు

తగరపువలస: ఎన్నికల ముందు ఒకమాట, తరువాత ఒకమాట చెప్పడం చంద్రబాబుకు అలవాటే అని వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఆనందపురం మండలం గండిగుండం పంచాయతీలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, స్థానిక సర్పంచ్ గండ్రెడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన 'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సంక్షేమ పథకాలను గడప గడపకు అందించారన్నారు. గ్రామాలలో క్లినిక్‌లు నిర్మించి ఇంటింటికీ వైద్యులను పంపించి కార్పొరేట్ వైద్యం అందించిన ఘనత జగన్‌దన్నారు. ఇందుకు భిన్నంగా కూటమి పాలన ఉందన్నారు.

- తల్లికి వందనం పథకం ద్వారా విద్యార్థికి రూ.15వేలు వంతున ఇస్తామన్న బాబు రెండో ఏడాది తరువాత రూ.13 వేలే ఇచ్చారన్నారు. అది కూడా జిల్లాలో ఇప్పటి వరకు 35 వేల మందికి ఈ పథకం లబ్ధి అందక కలెక్టరేట్‌ల చుట్టూ తిరుగుతున్నారన్నారు.
- రైతుభరోసా పేరుతో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మూడు విడతలుగా ఏటా రూ.13,500 వంతున రైతులకు పెట్టుబడి సాయం అందించి అండగా నిలబడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లకు గాను రూ.5వేలు వంతున పాక్షిక సాయం అందించి సంబరాలు చేసుకోవడాన్ని ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు.
- విద్యావ్యవస్థను చంద్రబాబు ప్రభుత్వం భ్రష్టు పట్టించిందన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలను ప్రోత్సహించడానికి డిగ్రీ, ఇంజినీరింగ్ తదితర ప్రవేశాలకు మీనమేషాలు లెక్కిస్తోందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎగ్గొట్టి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు.
- కూటమి ప్రభుత్వం మాయ మాటలు చెప్పి ప్రజలతో ఓట్లు వేయించుకుని సంక్షేమాన్ని గాలికి వదిలేసిందన్నారు. ఇప్పటి వరకు సెంటు స్థలం లేదా ఇల్లు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. ఎన్నికల హామీలు నెరవేర్చే వరకు ప్రజల పక్షాన నిలిచి కూటమి ప్రభుత్వం మెడలు వంచుతామని హామీ ఇచ్చారు. పంచాయతీ వాసుల కోలాటం, బాణసంచా తదితర సాంస్కృతిక కార్యక్రమాలతో సందడిగా జరిగింది. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, ఎంపీటీసీ సభ్యురాలు పావాడ గౌతమి, డోల ఆనంద్, వైస్ ఎంపీపీలు పాండ్రంగి శ్రీను, బొట్ట రామకృష్ణ, పాండ్రంగి అప్పారావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు చందక సూరిబాబు, పల్ల రమణ, కోరాడ వెంకటరమణారావు, గండ్రెడ్డి నరసింగరావు, సురేష్, గంట్ల అచ్చిబాబు, ఎలుగుబంటి రామకృష్ణ, భీమవరపు అప్పలరాజు, గీతల దేవుడు, గొంతిన అచ్చిబాబు బంక కృష్ణంనాయుడు, పినిశెట్టి సింహాచలం నాయుడు, ఎర్ర అప్పలనాయుడు, షిణగం దామోదరరావు, కోరాడ అప్పలస్వామినాయుడు, చందక సూరిబాబు, జిన్నాల వెంకటరమణ, బంక శ్రీను, గుసిడి ముత్యాలు, విజినిగిరి అప్పలరాజు, లెంక రాంబాబు, నాగోతు మహేష్, తెడ్లాపు గోవింద్, ఇల్లపు వెంకట్, చందక అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పులివెందులలో ప్రజాస్వామ్యం అపహాస్యం

ఇటీవల జరిగిన పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానాల ఎన్నికలలో కూటమి ప్రభుత్వం వేసిన కుప్పిగంతులను చూసి ప్రజలు నివ్వెరపోయారన్నారు. సోషల్ మీడియా వేదికగా పోలీసులు, పక్క నియోజకవర్గాల కూటమి నాయకులు నిస్సిగ్గుగా రిగ్గింగ్‌కు పాల్పడ్డారన్నారు. సోషల్ మీడియాలో వీరి వేషాలు చూసి నవ్వుకుంటున్నారన్నారు. 'పథకాలు ఇచ్చాము .. అందుకే గెలిచాము' అని సొంత డబ్బా కొట్టుకుంటున్న వారికి ప్రజలే తగిన శాస్తి చేస్తారన్నారు. పేదవారి తరఫున వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు.

పాండ్రంగి వద్ద కాజ్‌వేపై నీటి ఉధృతి



కాజ్‌వే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి జ్ఞానవేణి



గోస్తని నదిలో కాజ్‌వేపై నుంచి ప్రవహిస్తున్న నీరు

రాకపోకల నిలిపివేత

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి సమీపాన గోస్తని నదిలో కాజ్‌వే పై నుంచి రాకపోకలు నిలిపివేయాలని ఎన్‌హెచ్–16 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, మండల ప్రత్యేక అధికారి జ్ఞానవేణి ఆదేశించారు. పాండ్రంగిలో కాజ్‌వే ప్రాంతాన్ని గురువారం ఆమె పరిశీలించి, పలు శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. భారీ వర్షాలు కురుస్తున్నందున కాజ్‌వే పై నుంచి నీరు ఉధృతంగా ప్రవహిస్తోందన్నారు. ట్రాఫిక్‌ను బోని మీదుగా మళ్లించేందుకు పోలీసులు ఏర్పాటు చేయాలన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ కె.ఆనందరావు, రేవిడి పీహెచ్‌సీ వైద్యాధికారి లీలా ప్రసాద్, విద్యుత్, పంచాయతీ రాజ్, పోలీస్, అగ్నిమాపక శాఖ అధికారులు పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు

పాండ్రంగి సమీపాన గోస్తని నదిలో కాజ్‌వేపై నుంచి రాకపోకలు సాగించవద్దని రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. వర్షాలు కురుస్తున్నందున కాజ్‌వే పై నుంచి నీరు ఎక్కువగా ప్రవహిస్తున్నందున ప్రయాణించవద్దని సూచించారు. కాజ్‌వే పై నీటిలో దిగి స్నానాలు చేయకూడదని పేర్కొన్నారు.

ల్యాండ్‌పూలింగ్ సర్వే నిలిపివేయాలని వినతి

పద్మనాభం: కొవ్వాడ పంచాయతీ సర్వే నంబర్ 237లో ల్యాండ్ పూలింగ్ కోసం చేస్తున్న సర్వే నిలిపివేయాలని సర్పంచ్ పి.రత్నం, రైతులు తహసీల్దార్ కె.ఆనందరావుకు వినతి పత్రం ఇచ్చారు. 237లో భూములు తీసుకుంటే తాము జీవనాధారం కోల్పోతామని తెలిపారు. 50 ఏళ్ల నుంచి జీడి మామిడి తోటల ఫలసాయంతో కొత్తకొవ్వాడ, పాత కొవ్వాడ, పెదరావుపల్లి, కాటకాపల్లి గ్రామాలకు చెందిన రైతులం ఆధారపడి జీవిస్తున్నామని పేర్కొన్నారు. ల్యాండ్ పూలింగ్‌లో భూమి తీసుకుంటే కొండ మీద నుంచి నీరు రాక వ్యవసాయ భూములు నిరుపయోగంగా మారిపోతాయని తెలిపారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో టీడీపీ నాయకులు సుబ్బరాజు, శ్రీను ఉన్నారు.